


# అగ్నిపర్వతాలు

## పద్మావతీ గంగాధర్

(1962 యువ మాసపత్రిక, దీపావళి సంచిక నుంచి)



అనుకోకుండా బాబాయి దగ్గర నుంచి ఉత్తరం రావడంతోమనస్సులో మానుపడుతున్న గాయం కెలక వేసినట్టయింది. గడచిన అయిదారు సంవత్సరాలుగా జరిగిన సంగతులన్నీ ఒక్కసారిగా జ్ఞాపకం వచ్చినయి. బ్రతికి ఉన్నన్నాళ్ళూ నాన్నని నానాయాతనలూ పెట్టి ఒక విధంగా ఆయన చావుకి కూడా తానే కారణమైన బాబాయి, దేవతలాంటి అన్నయ్య జీవితం నిరర్థకం చేసిన బాబాయి, పరోక్షంగా అయినా సుందరి అక్క అకాలమరణానికి కారణభూతుడైన బాబాయి, ఇప్పుడు తన అనుగ్రహాన్ని నా మీదకు మళ్ళించినట్లుంది ! చేతలను బట్టిగాక, వ్రాతలనుబట్టి, మాటలను బట్టి మనుషుల్ని అర్థం చేసుకోవలసి వస్తే, ఈ ఉత్తరం చూసి బాబాయిని ఎవరయినా ధర్మరాజు అనుకుంటారు.

ఎదురుగా డ్రాయరు మీద గాలికి రెపరెప కొట్టుకుంటున్న ఆ ఉత్తరం తీసి మళ్ళీ ఒకసారి సావధానంగా చదివాను.

★ ★ ★

చిరంజీవి చిన్నబాబుకు దీవించి వ్రాయునది. ఎప్పుడూ ఉత్తరం వ్రాయని బాబాయి యీనాడు వ్రాస్తున్నందుకు ఆశ్చర్య పడుతున్నావా బాబూ ! ఏం చేయను ? కాటికి కాళ్ళు చాచిన ఈ వయస్సులో కూడా నాకు సంసార జంజాటం తప్పలేదు.

నీకు రెండేళ్ళు నిండకముందే కుటుంబ భారమంతా నాకప్పచెప్పి మా అన్నయ్య కళ్ళుమూశాడు. ఆయనను నీవు ఎరగవు బాబూ ! ఆయన సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి, ఆ రోజులు తలుచుకొంటే, ఇప్పటికీ నాకు కళ్ళు చెమ్మగిల్లుతాయి. బ్రతికినన్నాళ్ళూ నలుగురిలో మంచి అనిపించుకొని వెళ్ళిపోయాడు. సత్య హరిశ్చంద్రుడు, దానకర్ణుడు అనేవాళ్ళు అంతా ఆయన్ని. అంత యోగ్యుడు మా అన్నయ్య ! అయితే ఆయన అతిమంచితనం వల్ల కుటుంబం ఆర్థికంగా కొంత దెబ్బతింది. అడ్డమయిన వాళ్ళకూ అడ్డం ఉండి మోసపోయాడు. నోటూ, పత్రం లేకుండా అప్పులు ఇచ్చాడు. నువ్వు పుట్టిన కొన్నాళ్ళకు మన భాగస్థులు మోసం చేయడం వల్ల వ్యాపారంలో నష్టం వచ్చింది, ఆ నష్టమంతా మన నెత్తినే రుద్దాలని వాళ్ళు ప్రయత్నించారు. ఎన్నడూ

అన్నయ్య మాటకు ఎదురు చెప్పి ఎరుగని నేను, ఆ రోజున మాత్రం, ఉండబట్టలేక నిన్ను ఎత్తుకొని తీసికెళ్ళి, “ఈ పసివాళ్ల కోసమైనా మీరు ఖచ్చితంగా ఉండండి. అభంశుభం, ఎరుగని బిడ్డలకు అడుక్కుతినే గతి పట్టించకండి” అని ప్రాధేయపడ్డాను. ఆవాళ మీ అమ్మ ఎంతగా ఏడ్చిందో తలుచుకుంటే కడుపు తరుక్కు పోతుంది. అందరం పట్టుపట్టడం వల్ల ఎలాగో ఆ వ్యవహారం నుంచి కొద్ది నష్టంతోనే బైటపడగలిగాం. ఆ తరువాత కొద్ది రోజుల్లో అన్నయ్య చనిపోయారు.

ఆనాటి నుంచి నేటిదాకా సంసారం బరువంతా, ఈ ఒక్క భుజం మీద మోసుకొస్తున్నాను చిన్నబాబూ! అన్నయ్య చేసిన అప్పులన్నీ తీర్చి పిల్లలు నలుగురిలోనూ తలెత్తుకు తిరగటానికి వీలుగా ఆస్తిలో కొంతలో కొంతయినా మిగల్చగల్గాను.

చదువుకోసం నిన్ను బస్తీలో పెట్టిన తర్వాత ఇక్కడి పరిస్థితులేవీ నీకు సరిగా తెలియవు. ఎప్పుడు వచ్చినా చుట్టంచూపుగా వస్తున్నావు, వెళ్తున్నావు. “చిన్నవాడు వాడికి ఈ బాధలన్నీ చెప్పి వాడి మనస్సు కష్టపెట్టటమెందుకులే” అని నేను ఎప్పుడూ ఏ విషయమూ నీకు చెప్పలేదు. నా తర్వాత మన కుటుంబ గౌరవం నిలబెట్టవలసి ఉన్న మీ మేలుగోరే ఏ పనయినా చేస్తూ వచ్చాను. గిట్టనివాళ్ళు ఎలా అనుకున్నా నేను బాధ పడను.

పెద్దబాబు అదొకరకంగా తయారయ్యాడు. వాడు పుట్టినప్పుడు వంశోద్ధారకుడు పుట్టాడని ఎంతో సంబరపడ్డాం. బారసాల, అన్నప్రాశన, అక్షరాభ్యాసం ఎంతో ఘనంగా చేశాం. ఎందుకీ అట్టాహాసమంతా అని అన్నయ్య అంటున్నా వినకుండా “వంశానికి పెద్దబిడ్డ, ఇప్పుడు ఖర్చుపెట్టకపోతే ఎప్పుడు పెడతాం” అని నేను పట్టుబట్టాను. మీ అందరిలోకీ వాణ్ణే ఎక్కువగా నేను దగ్గరికి తీశాను. రోజూ నా దగ్గరే అన్నం తినేవాడు. పినతల్లి నిద్దరపుచ్చితే తప్ప నిద్ర పోయేవాడు కాదు. చచ్చి ఏలోకంలో ఉందో ! దానికీ వాడంటే పంచప్రాణాలూను.

వాడు సుఖంగా వుంటే చూసి సంతోషించాలని, బోలెడంత ఆస్థితో చదువుకున్న పిల్లను తెచ్చి పెళ్ళి చేశాను. అందుకే చివరికి వాడికి నేను విరోధిని అయ్యాను. ఆ పిల్లతో సరిగా ఉండడం లేదనీ, చెడు తిరుగుళ్ళు కూడా తిరుగుతున్నాడని, ఎన్నో మాటలు వింటున్నాను. ఆ మనిషి తత్వం ఏమిటో నాకర్థం లేకుండా ఉంది. ‘ఏమిరా’ అంటే దేనికీ సమాధానం చెప్పడు. ఎన్ని అన్నా విని సమాధానంగా ఒక్క నవ్వు నవ్వి వెళ్ళిపోతాడు. భగవంతుడు ఎందుకిల్లా నన్ను పరీక్షిస్తున్నాడా అనిపిస్తుంది.

నాకూ రోజులు దగ్గిరకు వస్తున్నాయి. నాలుగడుగులు వేస్తే ఆయాసం. ఎవరిది వాళ్ళకు అప్పజెప్పి, కృష్ణా, రామా అనుకుంటూ కాలం గడపవలసిన యీ వయస్సులో కూడా సంసారభారం తప్పలేదు నాకు.

ఇంతకూ చెప్పదలచుకున్నది చెప్పకుండా ఏదో చాదస్తంగా వ్రాసుకు పోతున్నాను. మీ పెద్దక్క కూతురు, ‘సుశి’ నీ వెరుగని పిల్లగాదు. ఇప్పుడు వాళ్ళంతా మన ఇంట్లోనే ఉన్నారు. ఆస్తి పాస్తులకు ఏమీ తక్కువలేదని నీకు తెలుసు కదా ! ఆ పిల్లను నీకిచ్చి పెళ్ళి చేయాలని మీ పెద్దక్క ముచ్చటపడుతూంది. అక్కా, బావా, స్వయంగా వచ్చి నిన్నే అడగాలనుకున్నారు. కాని పెద్దవాణ్ణి గదా అని ముందుగా నాతో చెప్పారు. “చిన్న బాబు నా మాట కాదనడు, నేను వ్రాసి కనుక్కుంటాను” అన్నాను. స్వయంగా వచ్చి నీతో మాట్లాడుదామంటే శక్తి లేకుండా పోయింది. కుటుంబంలో కుటుంబం అంతా కలిసి మెలిసి సుఖంగా ఉంటే చూసి కళ్ళు మూస్తాను. నామాట కాదనకు బాబూ ! తండ్రి తరువాత తండ్రంత వాణ్ణి. నీ అంగీకారం తెలిపితే పెద్దబాబుతో కూడ మాట్లాడుతాను...

★ ★ ★

ఉత్తరం ఎంత జాగ్రత్తగా చదివినా బాబాయి నిజస్వరూపాన్ని పట్టి ఇచ్చే పొల్లు మాట ఒక్కటి కూడా కన్పించలేదు.

మానవుడు, ఎంత క్లిష్టమైన ప్రశ్న ! సృష్టి రహస్యాలన్నీ అర్థం చేసుకున్నానని విర్రవీగే మానవుడికి తనని గురించి మాత్రం తనకు తెలియదు. ఈ క్షణం దానవుడిగా కనిపించిన వ్యక్తే మరోక్షణంలో దేవతగా గోచరిస్తాడు. ఒకరికి దేవతగా అనిపించిన వ్యక్తి మరొకడికి దానవుడుగా కనిపిస్తాడు.

సుందరి అక్క హటాత్తుగా గుండె ఆగి చనిపోయిందని న్యూయర్కు నుంచి కేబిల్ వచ్చినప్పుడు, ఎందరెందరు ఎన్నెన్ని విధాలుగా అనుకోలేదూ ? పాతికేళ్ళకే, నూరేళ్ళూ నిండిపోయిన సుందరి అక్క జీవితం నిజంగా ఒక కథలాగా అయిపోయింది.

★ ★ ★

సుమారు రెండేళ్ళవుతుంది. మద్రాసు ‘లా’ కాలేజీలో బి.యల్. చదువుతున్నాను. ఒక ఆదివారం పయిక్రాఫ్ట్ రోడ్డు వెంట మెరీనా బీచికి పోతూవుంటే పేవ్ మెంట్లమీద పరచి అమ్ముతున్న సెకండు హాండు పుస్తకాల్లో నా అభిమాన రచయిత వాల్ట్ విట్ మన్ వ్రాసిన ‘లీవ్స్ ఆఫ్ గ్రాస్’

కనిపించింది. వెంటనే వాడడిగిన ధర ఇచ్చి అది కొన్నాను. బీచ్ లో కాసేపు కాలక్షేపం చేసి ఆ దారిన అటే హోటలుకు వెళ్ళి భోజనం చేసి నా అద్దె గదికి చేరుకునేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది.

టేబుల్ లైటు వేసుకొని, ఈజీచైర్ లో కూర్చొని సాయంత్రం కొన్న పుస్తకం ఒక సారి తిరగేద్దామని టేబిల్ మీదనున్న పుస్తకం తీసి తెరచాను. దాంట్లోనుంచి మడతపెట్టి ఉన్న కాగితాలు కిందపడినయి. ఏమిటో ఆ కాగితాలని తీసి చూశాను, మొదటి వాక్యం చదివి, ఇదేదో కథలా ఉందని చివరి వరకూ చదివాను.

నిజానికి అది కథగాదు. ఎవరో ప్రేమికుడు వ్రాసిపెట్టుకొన్న ప్రణయ వృత్తాంతం. ఎవరా ఈ ప్రేమికుడని ఆ పుస్తకంలోపలి పేజీ తీసి చూచాను. డాక్టరు పి.రఘునాథరావు, యం.ఏ.పి.హెచ్ డి. అని ఉంది.

ఒక అపరిచిత వ్యక్తి ప్రణయగాథ చదవటం తప్పేమో అని మొదట సంకోచించాను. కాని కుతూహలం పట్టలేక ఆ కాగితాలు మొదట నుండి చివరి దాకా చదివాను.

ఆ రఘునాథరావు ఎవరో నాకు తెలీదు గాని ఆ కథలోని నాయిక సుందరిని గురించి చేసిన వర్ణన అంతా మా సుందరి అక్కకు సరిపోతోంది. ఆ గాథ నాలో ఎన్నెన్నో అనుమానాలు, విడతీయలేని ప్రశ్నలు రేకెత్తించి నన్ను చాల కలచివేసింది.

★ ★ ★

సముద్రపు అలలతో ఆడుకొంటూ, సముద్రం నురుగులో పాదాలు తడుస్తూ ఉండగా మద్రాసు బీచివెంట నడుస్తూ సుందరీ, నేనూ. ఎన్నో సాయంత్రాలు గడిపాం. సుందరి నిజంగా సముద్రంలాంటి మనిషి. అంతలో కలకలమని నవ్వేది. అంతలో కోపం తెచ్చుకొని పెడమొగం పెట్టేది. ఆమె మనస్సులో భావం రవ్వంత కూడ పైకి పొక్కనిచ్చేది కాదు. అయినా నాతో ఎంతో చనువుగానుండేది. తెగనవ్వించేది, కవ్వించి కవ్వించి విసిగించేది. సముద్రంలాగ గంభీరమైన ఆమె మనస్తత్వాన్ని అర్థంచేసుకోలేని నా తెలివి తక్కువ తనానికి నేను చల బాధపడుతూ ఉండేవాణ్ణి.

సుందరితో ఎవరైనా మాట్లాడుతూ ఉంటే నేను ఈర్ష్యతో కుమిలిపోయేవాణ్ణి. అప్పుడప్పుడు ఆపుకోలేనంత కోపం వచ్చేది. కాని వాళ్ళను నేను ఏమి చేయగలను ? నా అశక్తతకు నాకు నేనే సిగ్గుపడి తలవొంచుకు పోతూ ఉండేవాణ్ణి. చాల సార్లు వాళ్ళను నిలబెట్టి 'నా సుందరి మీతో ఏమి చెప్పింది' అని అడగాలనిపించేది. ఎవరిని ఎప్పుడు ఏ ప్రశ్న అడగవచ్చునో, ఏ ప్రశ్న అడగ కూడదో నాకు తెలియదు. చిన్ననాటినుంచీ అలాంటి నేర్పు నాకు అలవడలేదు. మనస్సులో ఉన్న మాట నిర్భయంగా పైకి చెప్పివేయాలనీ, సంఘంలో అందరిలాగా నేనూ తలెత్తుకు తిరగాలనీ అనుకొనే వాణ్ణి. కాని ధైర్యం చాలేది కాదు. నేను పుట్టడమే పిరికితనం స్వరూపంగా పుట్టినట్టున్నాను. అంతా నన్ను అదొక మాదిరిగా చూసి వెళ్ళి పోతుండేవారు. నా వెనక నా గురించి నవ్వుకుంటున్నట్టు నాకనిపించేది. వాళ్ళంతా నన్నొక పిచ్చివానిగా భావిస్తున్నారని నా అనుమానం. అందుకే లోకంలో అందరినీ శత్రువులుగానే నేను చూసేవాణ్ణి. నా భాష వాళ్ళకర్థంకాదు. వాళ్ళ భాష నాకర్థంకాదు.

ఎడారి లాంటి నా జీవితంలోకి తొలకరిలాగా ప్రవేశించింది సుందరి. అందరిలాంటి మనషిగాదు సుందరి. లోకానికంతకూ నాలో వక్రతలుగా కనిపించిన లక్షణాలే సుగుణాలుగా పోగేసి సుందరి పొగడేది. కేవలం జాలితో అలా నటిస్తున్నదేమోనని కదా సుందరిని నేను అనుమానించిన సందర్భాలు లేకపోలేదు. అంత అనుమానంతో, అంత భయంతో బ్రతికిన నాకు సుందరి లాంటి దేవత ఎలా దక్కుతుంది ? కలలాగ, కథలాగ నా జీవితాన్ని మిగిల్చి ఆమె వెళ్ళిపోయింది.

అసలు నేను పుట్టక మునుపే, అమ్మ కడుపులోనే చనిపోయి ఉంటే ఎంతో బాగుండేది. అమ్మ అలాంటి ప్రయత్నాలు ఏమయినా చేసిందేమో నాకు తెలియదు. ఛ! అమ్మ అలాంటిది అయివుండదు. కాని అమ్మను అలా చేయమని చాలా మంది సలహా మాత్రం ఇచ్చి ఉంటారు. ఆమె ఆ సలహాలు పాటించి ఉంటేనే బాగుండేదేమో అనిపిస్తుంది. అప్పుడు నాకు ఏ సమస్యా ఉండేది కాదు గదా ! ఎందుకూ కొరగాని ఈ డబ్బు మాత్రం నాకు మిగిల్చి ఆమె దారిన ఆమె వెళ్ళిపోయింది.

ఆ రోజు నా జన్మలో ఎప్పుడూ మరచిపోలేను. బీచికి వెళ్దామా, వద్దా అనుకుంటూనే బీచివైపు నడచాను. జన సమర్దానికి దూరంగా ఇసుకలో నడుస్తూ ఉండగా ఒక చోటకొచ్చేటప్పటికి నా కాళ్ళు భూమిలో పాతుకు పోయినట్లు నిలిచిపోయినాయి. అక్కడ నుంచి మరి కదలటానికి మొరాయించాయి.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. ఒంటరిగా అలలవంక చూస్తూ ఏదో ఆలోచిస్తూ అక్కడ సుందరి కూర్చొని ఉంది. ఎవరో మహాశిల్పి తన సర్వతపస్సూ ధారవోసి ఆ జగదేక సుందర విగ్రహం సృష్టించి అక్కడ కూచోపెట్టి వెళ్ళిపోయినట్లనిపించింది.

వేసవి కాలపు ఆదివారం, బీచి అంతా రంగురంగుల దుస్తుల జనంతో, విలాస పురుషుల చేతుల్లోని ట్రాన్సిస్టర్ రేడియోల నుంచి వచ్చే సిలోన్ రికార్డు సంగీతంతో నిండిపోయి ఉంది.

సుందరి దగ్గరకు వెళ్ళి పలకరించాలనుకొన్నాను. అలా అనుకునే సరికే ఒళ్ళంతా ముచ్చెమటలు పోసినయి. ధైర్యం చేసి ఆమెకు కనబడేటట్లు రెండు సార్లు యిటూ, అటూ పచార్లు చేశాను, ఆమె నన్ను చూసి చిరునవ్వు నవ్వినట్లనిపించింది. అయినా ధైర్యం చాలలేదు. ఆమెకు కొంచెం దూరంలో చతికిలపడి అవకాశం దొరికినప్పుడల్లా ఆమె అపురూప సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ కూర్చున్నాను. చూస్తూ, చూస్తూ ఉండగానే మబ్బు కమ్ముకు వచ్చింది. వానవచ్చేటట్టుంది. మద్రాసులో ఏమాత్రం నోటీసు ఇవ్వకుండానే వచ్చేస్తుంది వాన. హడావిడిగా జనం ఇంటిముఖం పట్టారు. సుందరి కూడా లేచింది. ఆమెను నాలుగడుగులు వేయనిచ్చి నేనూ లేచి ఆమెకు తెలియకుండా ఆమె వెనకాతలే బయల్దేరాను.

బస్సుస్టాపులో బస్సుకోసం ఎదురు చూస్తూంది సుందరి. నేను ధైర్యం చేసి ముందుకు వెళ్ళి "నా కారు ఇక్కడే ఉంది... మీ కభ్యంతరం లేకపోతే.. మిమ్మల్ని మీ యింటివద్ద దిగబెడతాను" అన్నాను మాటలు తడబడుతూ.

"థేంక్సు... మీకు శ్రమ ఎందుకు ?... బస్సుమీదనో, టాక్సీమీదో వెళతానులెండి" అంది, ఎంతో సౌమ్యంగా నవ్వుతూ.

"ఇందులో పెద్ద శ్రమేముందండి ? వాన వచ్చేట్టుంది... తడిసిపోతారు... నా కారు దగ్గరలోనే పార్కుచేశాను... రండీ..." అన్నాను. నాటి నా ధైర్యానికి నాకే ఆశ్చర్యం వేస్తుంది యిప్పటికీ, ఆ మాట గుర్తుకొచ్చినప్పుడల్లా.

ఒకరి పక్కన ఒకరం నడుస్తూ కారు దగ్గిరకు వచ్చిన క్షణాలు, నేను ఫ్రంటు డోరు తీయగా ఆమె నా పక్కన కూర్చుని, వాళ్ళ యిల్లు వచ్చేదాకా గడిపిన ఆ మధుర క్షణాలూ నా జీవితంలో మరపురావు. ప్రతి మనిషి జీవితంలోనూ అలాంటి క్షణాలు బహుకొద్దిగా మాత్రమే ఉంటాయి. కాని ఆ కొద్దిక్షణాలనే నెమరు వేసుకొంటూ ఒక జీవితకాలం గడిపి వేయవచ్చు!

రోజూ తన వెంట బీచికి వచ్చే వ్యక్తి వాళ్ళ అన్నయ్య అని తెలుసుకొన్నప్పుడు నా హృదయం ఎంతో తేలికపడింది. మా కాలేజీలోనే సుందరి జువాలజీ యమ్.ఎస్సి. చదువుతుందని తెలుసుకొన్నప్పుడు మరీ సంతోషమైంది. కారులో వాళ్ళ యిల్లు చేరుకొన్న తరువాత నేను లోపలకు వచ్చి కాఫీ తీసుకొని వెళితేగాని వీలు లేదని ఆమె పట్టుపట్టింది. అలా ఆరంభమైంది సుందరితో నా పరిచయం.

అందం అంటే సుందరిదే అందం. ఎంత మంది ఆడపిల్లల మధ్య ఉన్నా గులకరాళ్ళ మధ్య రత్నంలాగా సుందరి మెరిసిపోతూ ఉండేది. సన్నగా రివటలాగా ఉండి, నడుస్తూన్నప్పుడు విలాసంగా ఊగిసలాడే ఆ శరీరం, ముఖం మీద నిరంతరం ప్రత్యక్షమయ్యే ఆ చిరునవ్వూ, గంభీరమైన సౌందర్య సరస్సుల్లా కనిపించే ఆ కాటుక కళ్ళూ, నుదురమీద దోబూచులాడే ముంగురులూ, గడ్డం మీద కుడి ప్రక్కగా ఆ చిన్న పుట్టుమచ్చా, ప్రతి కదలికలోనూ, విస్పష్టమయ్యే ఆమె చురుకుదనం __ సుందరిని ఒకసారి చూసిన వాళ్ళకు, ఇక జన్మలో ఆమె మూర్తి మరుపు రాదు.

ఆమె భవిష్యత్తును గురించే నేను ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాణ్ణి. ఇంత అందమైన సుందరికి, ఇంత విజ్ఞాన ఖని అయిన సుందరికి ఎటువంటి భర్త లభిస్తాడో కదా అనుకొనేవాణ్ణి. సమాంతర రేఖలు అనంతంలో గాని కలువవు అంటారు కొందరు విజ్ఞులు. కాని సుందరి విషయంలో అలా కాకూడదనుకుంటూండే వాణ్ణి. మేము తరచు కలుసుకుంటూనే ఉన్నా, ఆమె నాతో చనువుగా మాట్లాడుతూనే ఉన్నా, ఆమెను నా భావి భార్యగా ఊహించుకునే ధైర్యం మాత్రం నాకు ఉండేది గాదు. ముందూ వెనుకా ఎవరూ లేని నావంటి నిర్భాగ్యుడికి అంతటి అదృష్టమా ? ఎక్కడో ఒక చోట సుందరి సుఖపడటమే నాకు కావలసింది అనుకునేవాణ్ణి.

ఆమెను వివాహమాడాలనే కోరికను ఎన్ని సార్లు మనస్సునుంచి తుడిచి వేసుకున్నా తిరిగి, తిరిగి అది ప్రత్యక్షమయ్యేది. నాలో నేను ఇలా ఆలోచించుకొనేవాణ్ణి..."తప్పేముంది? తిన్నగా వెళ్ళి సుందరి అన్నయ్యనే అడుగుతాను. ఒక ధరఖాస్తు పెట్టుకొన్నట్లుగా నా కుటుంబ పరిస్థితీ, ఆస్తిపాస్తుల వివరాలూ, నా చదువు సంధ్యలూ, భవిష్యత్తుని గురించిన నా ఆలోచనలూ __ అన్ని సంగతులు దాపరికం లేకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పేస్తాను... 'నా ఇష్టం ఏమీ లేదు, అంతా సుందరి ఇష్టం' అంటాడేమో ఆయన, సుందరి అందుకు యిష్టపడుతుందా ? నేనంటే ఇష్టంలేకపోతే 'కాఫీ తాగుదాం రం'డంటే

నాతో రోజూ క్యాంటీనుకు ఎందుకు వస్తుంది ? ఇద్దరికీ క్లాసులు లేనప్పుడల్లా క్యాంటీనులోనో, కాలేజీ ఆవరణలోనున్న జువ్వి చెట్టునీడనో జేరి పిచ్చాపాటీ మాట్లాడుతూ గడిపేవాళ్ళం. అనేక పర్యాయాలు నాతో ఒంటరిగా బీచికి వచ్చింది. నేనంటే సుందరికి బహుశః ఇష్టమేనేమో!"

'ఒకరోజున ఒక గమ్మత్తు జరిగింది. క్యాంటిన్ లో కాఫీ తాగుతున్నాం. సెలవల్లో వాళ్ళ మేనమామగారి ఊరు వెళ్ళాలనుకొంటున్నట్టు మాటల సందర్భంలో సుందరి అంది. వాళ్ళు చాలా సార్లు నిష్ఠూరం వేశారట ! వెళ్ళకపోతే కోపం వస్తుందట ! తన మేనత్త చాల మంచిదట... ఏమిటేమిటో చెప్పుకు పోతూంది. కాని ఒక్క మాటా నా చెవిని పడలేదు. కొంతసేపయాక ఉన్నట్టుండి "వాళ్ళకు పిల్లలున్నారా ?" అని ప్రశ్నించాను.

"ఆ! నాకన్నా పెద్దవాడు ఒక కొడుకున్నాడు. ఇప్పుడు అతడు యం.బి. ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరు కూతుళ్ళు కూడా ఉన్నారు. వాళ్ళు నాకంటే చిన్నవాళ్ళు. కాలేజీ చదువులకు వచ్చారు..." అంది.

"అయితే మీ అన్నగారికి శ్రమలేదన్నమాట..." అన్నాను.

ఒక్క నిముషం ఏమీ సమాధానం చెప్పకుండా ఊరుకొని. తరువాత నా ముఖంలోకి సూటిగా చూస్తూ కిలకిలా నవ్వడం మొదలు పెట్టింది.

"ఎందుకలా నవ్వుతావు..." అన్నాను ఏదో తప్పుచేసినవాడిలా ఖంగారు పడుతూ. ఆమె మళ్ళీ నవ్వింది.

"నా ముఖంలో తోలుబొమ్మలు ఏమీ ఆడటం లేదే..." అన్నాను వచ్చీరాని కోపం ప్రదర్శిస్తూ. నా హృదయావేగాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తూ.

పమిటి చెంగు నోటికడ్డం పెట్టుకొని అలా నవ్వుతూనే, ఆ నవ్వుతెరలమధ్య "మీ... ముఖం సంగతి... మీకెట్లా తెలుస్తుంది ?.. ఎదురుగా కూర్చున్న నాకు తెలుస్తుంది గాని..." అని అంది సుందరి.

ఇంక చేసేదేమీ లేక నేనూ నవ్వు ముఖం పెట్టాలని ప్రయత్నించాను.

"మీరు నవ్వాలని ప్రయత్నిస్తున్న సంగతి కూడ మీ ముఖం చెపుతోంది... మీ మనస్సులో ఏదో గాలిదుమారం చెలరేగుతున్న సూచనలు మొఖంలో స్పష్టంగా కనబడుతూనే ఉన్నాయి...." అంది సుందరి వస్తున్న నవ్వును ఆపుకొంటూ.

"ఏమిటి మరీ ఇవ్వాళ ఇలా..."

"ఏముంది ?... నేను నవ్వుతో ఏదో అంటే అబ్బాయిగారు గాబరాపడిపోయారు. మా మేనత్తకు పిల్లాలేరు, పీచూ లేరు. ఇంక తమరు స్థిమితంగా పూర్వాశ్రమానికి తిరిగి రావచ్చు..."

మాంచి సంతోషంగా ఉన్నప్పుడు చూడాలి సుందరిని. అంతకంటే పసిపిల్ల మరి ఉండదు. ఆ గాంభీర్యమంతా ఎక్కడికి పోతుందో?... నవ్విస్తుంది. కవ్విస్తుంది. చుట్టూ ఉన్న లోకాన్ని మరిచిపోయి ఏదో స్వర్గలోకపు పొలిమేరల్లో విహరిస్తున్నట్లు కన్పిస్తుంది.

'మళ్ళీ నిరాశ. నిస్పృహ ఆవరించిన క్షణాల్లో సుందరి అంత వేదాంతం ఎవ్వరూ మాట్లాడరు. అలాంటి సందర్భంలో ఆమె మీద నా గౌరవం ఎక్కువ అవడంతో పాటు, ఆమె లోని ఆ నిస్పృహని తుడిచివేసే శక్తి నాకు లేకపోయెనే అనే దిగులు నన్ను కాల్చి వేస్తుంది.

'నా కుటుంబం సంగతి తెలిస్తే మాత్రం ఈ పెళ్ళికి సుందరి ఒప్పుకోదేమో అనే భయం ఒకటి నన్ను నిరంతరం వెంటాడుతూండేది. నన్ను నిరాకరించటమేగాక, ఇన్నాళ్ళూ నేను నాటకమాడానని, నన్ను ఎంతగా ఏవగించుకుంటుందో అనిపించేది.'

★ ★ ★

ఇక్కడిదాకా వచ్చి హఠాత్తుగా కథ ఆగిపోయింది. తరువాతి కాగితాలు ఎక్కడయినా పోయినాయో, లేక ఆ రఘునాధరావు అంతవరకే రాశాడో తెలియదు.

నా చిన్నతనంలోనే అమ్మా నాన్నా చనిపోవటం వల్ల అన్నయ్య, సుందరక్క నన్ను అతిగారాబంగా పెంచారు. నేను కాలేజీ చదువుకు వచ్చింతరువాత కూడ వాళ్ళు నన్ను పసివాడుగానే చూసేవాళ్ళు. వాళ్ళ వాత్సల్యం ఒక్కటే నేనెరుగుదును గాని వాళ్ళ జీవిత సంపుటాలలోని లోపలి పుటలలో ఏమున్నదో నాకేమీ పెద్దగా తెలియదు. వాళ్ళ సమస్యలు, కష్టసుఖాలు నాతో చెప్పి నా మనస్సు నొప్పించటం ఇష్టం లేక అనుకొంటాను.. వాళ్ళెప్పుడూ సంసార విషయాలు గాని, తమ వ్యక్తిగత విషయాలు గాని నాతో మాట్లాడేవాళ్ళు కాదు.

ఒక వేళ ఈ ప్రణయ కథలోని నాయిక సుందరి అక్కేనేమో ? కాని అలాంటి ప్రణయఘట్టం ఆమె జీవితంలో సంభవించి ఉంటే అవివాహితగానే ఆమె చనిపోవటం ఎందుకు జరుగుతుంది ? ఆ రఘునాధరావయినా పెద్ద చదువు చదివినవాడే కదా ! సుందరక్క యిష్టపడితే ఎంత కష్టమైనా పోసి

అన్నయ్య ఆమెకు వివాహం చేయకుండా ఉంటాడా ? అంతా చిత్రంగా ఉంది. అన్ని ఏళ్ళ వరకూ సుందరి అక్క వివాహం విషయంలో అన్నయ్య ఆలోచించక పోవటంలో అన్నయ్య ఉద్దేశ్యమేమిటి ?

ఇలాంటి ప్రశ్నలు మనస్సులోకి రాకుండానే ఉండాలిగాని వచ్చిన తరువాత వాటికి జవాబులు దొరికేవరకూ మనస్సుకు స్థిమితం ఉండదు. ఈ సారి అన్నయ్య మద్రాసు వచ్చినప్పుడు ధైర్యంగా అన్నయ్యనడిగి కుటుంబానికి సంబంధించిన సంగతులన్నీ వివరంగా తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాను.

తరువాత వారం రోజులకే ఏదో ఆఫీసు పనిమీద అన్నయ్య మద్రాసు వచ్చాడు. ఎప్పుడూ ఉల్లాసంగా నవ్వుతూ పేలుతూ ఉండే నాలో ఏదో మార్పు అన్నయ్యకు కనిపించినట్లుంది. ఆ రాత్రి భోజనాలు చేసి గదికి చేరుకొన్న తరువాత "ఏమిటి చిన్నబాబూ ! ఏదో దీర్ఘాలోచనలో పడినట్లు అదోలా వున్నావు ఈసారి..." అన్నాడు అన్నయ్య. నేను అనుకోని ప్రశ్న అది. ఎంత ధైర్యం కూడదీసుకొన్నా ఆయనకు నేను ఏమీ సమాధానం చెప్పలేక పోయాను. తరువాత నా డ్రాయరులో భద్రంగా ఉంచిన రఘునాధరావు ప్రణయగాథ తాలుకు కాగితాలు తీసి అన్నయ్య చేతికి ఇచ్చాను. "ఏమిటివి?" అంటూ జేబులోంచి కళ్ళజోడు తీసి పెట్టుకొని అన్నయ్య ఆ కాగితాలు అద్యంతం చదివాడు.

చదవటం పూర్తయిన తరువాత ఇద్దరం కొంత సేపు మౌనంగా ఉండిపోయాం. అన్నయ్య కళ్ళల్లో నీళ్ళు తిరగటం, నేనెక్కడ చూసిపోతానో అని, అతి ప్రయత్నం మీద ఆయన ఆపుచేసికోవటం నేను గమనించాను.

ఒకసారి గొంతుక సవరించుకొని "అవును చిన్నబాబూ ! నీ అనుమానం సరి అయిందే. ఈ కథలో సుందరి మన సుందరే బాబూ! రఘూ, సుందరీ ఒక కాలేజీలోనే చదువుకుంటూ ఉండేవాళ్ళు. సుందరికి కూడా అతడంటే చాలా ఇష్టం. ఆ మాట ఎప్పుడూ నాతో ఎదురుగా సుందరి అనకపోయినా అనేక పరిస్థితులను బట్టి నేనే స్వయంగా ఆ విషయం తెలుసుకొన్నాను అదంతా ఒక కథలాగే జరిగిపోయింది చిన్నబాబూ ! ఈ గొడవలన్నీ నీకు ఎప్పుడూ తెలియకుండా ఉంటేనే బాగుంటుందనుకొన్నాను గాని ఇంతవరకూ వచ్చిన తరువాత యిక నీ దగ్గర ఏ సంగతీ దాచలేను..." అంటూ అన్నయ్య టవలుతో కళ్ళు వత్తుకొన్నాడు.

"ఇద్దరూ... ఇష్టపడ్డప్పుడు మరి... రఘుతో సుందరి అక్క వివాహం ఎందుకు జరుగలేదు అన్నయ్యా..." ధైర్యం అంతా కూడ తీసుకొని అన్నయ్యను అడిగాను.

ఏదయినా సంగతి, కళ్ళకు కట్టినట్లు అంత చక్కగా అన్నయ్య చెప్పగలడని ఆ రోజు వరకూ నాకు తెలియదు. మధ్య మధ్యలో, నా మనస్సులో తలెత్తుతున్న సందేహాలన్నీ ఆయన ఎలా పసిగట్టేవాడో, ఎప్పటికప్పుడు నేను అడక్కుండానే నా సందేహాలు తీరిపోతూ ఉండేవి. ఒక కాలు పైకి పెట్టి కుర్చీలో ముందుకు వంగి కూర్చొని, సిగరెట్టు కాల్చుకొంటూ ఆ రోజున ఆ సంగతులన్నీ చెప్పిన అన్నయ్య మూర్తి నాకెన్నటికీ మరుపు రాదు.

★ ★ ★

"సుందరిని ఒక ఇంటిదాన్ని చేయలేక పోతున్నానే అని నేను ఎంత బాధపడేవాణ్ణో ఆ భగవంతుడికే తెలుసు బాబూ! కాని యీ పాపిష్టి చేతులతో ఆమెకు అంత్యక్రియలైనా చేసే భాగ్యానికి నేను నోచుకోలేదు.

"రోజూ, నేనే, సుందరిని వెంటపెట్టుకొని బీచికి తీసికెడుతూ ఉండేవాణ్ణి. కాని ఆమె కాలేజీలో పై తరగతుల్లోకి వచ్చిన తరువాత "తోటి" స్నేహితులెవరైనా కనిపిస్తే మాట్లాడటానికి వీలు లేకుండా నేనెందుకు ఆమె వెంట ? అని తరచు ఏదో వంక చెప్పి ఆమె వెంట వెళ్ళటం మానేసేవాణ్ణి. అలాంటి ఒక సందర్భంలోనే రఘుతో ఆమెకు పరిచయం అయిందన్న మాట. వాళ్ళ స్నేహం బాగా ముదిరేవరకూ ఆ విషయం నేను గుర్తించలేక పోయాను. సుందరికి అతని మీద ప్రేమ ఉన్నట్లు చూచాయగా నాకు అర్థం కాగానే ఆ రఘు కుటుంబం మంచి చెడ్డలు విచారించాను.

"అతడొక దురదృష్ట వంతుడు. పుట్టడం అయితే ఉన్నత కుటుంబంలోనే పుట్టాడు. కాని అతని పుట్టుక గురించి అనేక విధాలుగా చెప్పుకొంటూ ఉంటారు. వాళ్ళ నాన్నకు రెండు పెళ్ళిళ్ళు. మొదటి సంబంధానికి పది, పదిహేనేళ్ళ కొడుకున్నా బంధువుల ప్రోద్బలంవల్ల, ఆయన మరల పెళ్ళి చేసుకొన్నాడు. ఆ రెండవ భార్య కూడా మంచి కుటుంబం లోనుంచే వచ్చింది. కాని ఆమె దురదృష్టవశాత్తు పెళ్ళయిన సంవత్సరానికే గుండె జబ్బుతో భర్త హఠాత్తుగా చనిపోయాడు. తర్వాత ఆమె పుట్టింటికి పోకుండా ఆస్తి పాస్తులు చూసుకుంటూ ఆ సవతి కొడుకుని చదివిస్తూ అక్కడే ఉండిపోయింది.

"కొడుకుని హైస్కూలు చదువు పూర్తయిన తర్వాత కాలేజీ చదువుకు పట్నం పంపించింది. ఒకసారి శలవలకి ఇంటికి వస్తూ అతడు తనతో పాటు తన స్నేహితుణ్ణి ఒకణ్ణి వెంటపెట్టుకు వచ్చాడు. వాళ్ళు వచ్చిన రెండు మూడు రోజులకే ఆ సవతి కొడుకు స్వంత మేనమామకు ప్రాణం మీదికి వచ్చిందనీ, మేనల్లుణ్ణి చూడాలంటున్నాడనీ కబురు వచ్చింది. స్నేహితుణ్ణి కూడ తన మేనమామగారి ఇంటికి తీసుకువెళ్ళటం ఎందుకని అతణ్ణి యిక్కడే వదలి ఆ అబ్బాయి ఒక్కడే బయల్దేరి వెళ్ళాడు. అతడు వెళ్ళిన రోజునే మేనమామ చనిపోవడంతో మళ్ళీ పది రోజులదాకా అతడు రాలేకపోయాడు.

"ఆ పదిరోజుల్లోనూ అది ఎలా జరిగిందో తెలియదుగాని పట్నంనుంచి వచ్చిన ఆ అబ్బాయితో ఆమెకు సంబంధం ఏర్పడింది. ఆ అవినీతికరమైన సంబంధానికి ఫలితంగా పుట్టినవాడే ఈ రఘు."

"స్నేహితుడుగా వచ్చిన ఆ అబ్బాయి ఎంత ద్రోహానికి తలపెట్టాడు" అన్నాను నేను ఆవేశంగా.

జీవితం తిరగవేసి బోర్ల వేసి చూసిన పరమవేదాంతిలాగ ఒక్క నవ్వు నవ్వి అన్నయ్య "అలా ఆవేశపడతావేం చిన్న బాబూ ! మనుష్య జీవితం చాలా చిత్రమైంది. పరిస్థితుల చేతుల్లో కీలు బొమ్మలు మనుష్యులంతాను. మంచి చెడ్డలూ, ధర్మాధర్మాలూ నిర్ణయించడం అంత తేలిక కాదు చిన్న బాబూ ! ఆ అబ్బాయి ననవల్సిన పనేమున్నది చెప్పు ? అభం శుభం తెలియని వయస్సు అతనిది. నడియౌవనంలో వైధవ్య కష్టానికి గురి అయిన నిర్భాగ్యురాలే అతని చేత ఆ తప్పు చేయించి ఉండవచ్చు. ఒక విధంగా చూస్తే ఆమె ప్రవర్తనను ఖండించలేము. అతడిని చూసేటప్పటికి ఆమెలో నిద్రాణమై ఉన్న కోరిక బలవంతాన అణచిపెట్టుకొన్న కోరిక ఆమెనలా పిచ్చి దానిని చేసుండవచ్చు .. ఆమెకు అలాంటి బాల్య స్నేహితుడొకడుండి వుండవచ్చు... ఆమెలో ఆనాడు అతడ్ని వివాహమాడాలనే కోరికుండవచ్చు... వాళ్ళిద్దరకు బాల్యంలోనే అలాంటి అనుబంధ సంబంధాలున్నవేమో.. ఆ కుర్రవాడిలో తన మొదట స్నేహితుణ్ణి చూచి ఆమె ఆవేశపడి ఉండవచ్చు... అలాంటి విచిత్ర పరిస్థితి ఏర్పడి ఉండకపోతే ఆమె కూడా జీవితాంతం పవిత్రంగానే బ్రతికి సంఘం చేత సెబాష్ అనిపించుకొనేదేమో ! మన హిందూ సంఘంలో ఎన్ని మంచి గుణాలున్నా ఒక సంగతి మాత్రం నేను హర్షించలేను. వ్యక్తుల అవసరాలను ఎంతమాత్రం పట్టించుకోకుండా సంఘం కోసమే ప్రతి వ్యక్తీ బ్రతకాలని ఆదేశిస్తుంది మన హిందూ సంఘం..." అన్నాడు.

కొంతసేపు మౌనంగా ఊరుకొని మళ్ళీ అన్నయ్య చెప్పటం సాగించాడు.

"తరువాత కొన్నాళ్ళకు పాపం ఆ కుర్రవాడు తాను చేసిన పని మహాఘోరంగా భావించి ఆత్మహత్య చేసుకొన్నాడట... ఇక ఆ తల్లి సంగతి... అడ్డమైన వాళ్ళూ గర్భస్రావం చేయించుకోమని ఆమెకు సలహా యిచ్చారట... అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించారట కూడానూ... కాని ఆ అబ్బాయి ఆత్మహత్య సంగతి విన్న తర్వాత ఆమె పూర్తిగా మొండికెత్తింది... ఆ అబ్బాయి వంశాంకురాన్ని లోకంలోకి రాకుండా నిరోధించే హక్కు తనకు లేదని తీర్మానించుకొంది. ఆస్తిలో తన వాటా అమ్ముకొని సొమ్ము చేసుకొని, ఆ ఊరునుంచి వెళ్ళిపోయింది. ఆ తరువాత పట్నంలో ఆమె ఆస్పత్రిలో ప్రసవించి చనిపోయిందనీ, ఆమె భర్త మిత్రుడయిన ఒక డాక్టరు ఆమె సవతి కొడుకుతో కూడ సంప్రదించి ఆ శిశువు సంరక్షణ బాధ్యత తాను వహించాడనీ, ఆయనే రఘుని పెంచి పెద్ద చేసి అతని ఆస్తి అతనికి వప్పచెప్పాడనీ అంటారు."

★ ★ ★

అప్పటికే బాగా పొద్దు పోయింది. ప్రొద్దుటి నుంచీ టౌనులో తిరిగి, తిరిగి అలసిపోయాడేమో అన్నయ్య ఆవులించడం మొదలు పెట్టాడు. ఆరిపోయిన సిగరెట్టును పారవేసి "నిద్దర వస్తోంది చిన్నబాబు, నీకు యింకా చాలా సంగతులు చెప్పాలి. రేపు మాట్లాడుకొందాం..." అన్నాడు అన్నయ్య ఎంతో బడలికగా.

పడుకోగానే గాఢమైన నిద్రపట్టేసింది అన్నయ్యకు. ఎన్నెన్నో అగ్నిపర్వతాలు హృదయంలో పెట్టుకొని చీకూ చింతా లేకుండా అన్నయ్య ఎలా బ్రతుకగల్గుతున్నాడో, నాకు ఆశ్చర్యం వేస్తుంది.

లైటు తీసేసి ఈజీచైర్ లో వెన్ను వాల్చి కిటికీలోనుంచి కనిపిస్తున్న అర్ధచంద్రుడు కేసి చూస్తూ ఏవేవో ఆలోచనల్లో పడ్డాను.

మా అన్నయ్య చదువు సంధ్యలు ఎలా సాగిందీ నాకు బాగా తెలీదు. చదువు పూర్తి కాగానే ఉద్యోగంలో చేరి సుందరి అక్కను తనదగ్గరే ఉంచుకొని, కాలేజీలో చదివిస్తూ ఉండేవాడు. ఆ రోజుల్లో మా అన్నయ్యకు పెళ్ళి సంబంధాలు చాలా వచ్చేవి. మిగిలిన సంబంధాలు అన్నీ కాదని చివరకు మా వదినతో మా అన్నయ్య పెళ్ళి నిశ్చయమైనప్పుడు చాలా మంది చాల రకాలుగా చెప్పుకొన్నారు. ఆ రోజుల్లో మా అక్క కూడా ఒకసారి చాటుగా ఏడుస్తూ ఉండడం నేను చూశాను. అన్నయ్య అయినా అంత సంతోషంగా ఉన్నట్లు కనిపించలేదు.

మా వదిన తండ్రి గారు ఒక తరానికి పూర్తిగా సరిపోయేటంత ఆస్తి సంపాదించి చనిపోయాడు. ఇద్దరే ఇద్దరు ఆడపిల్లలు. అంతా బాగానేవుంది, కాని మా వదిన తండ్రి వాళ్ళమ్మను ఉంచుకొన్నాడట; పెళ్ళి చేసికోలేదట. పోతూ పోతూ ఆస్తి అంతా ఆమెకూ, పిల్లలకూ రాసి యిచ్చాడట !

ఒక్కొక్కప్పుడు డబ్బు ఎన్ని అవగుణాలనయినా కప్పి పెట్టగలదు. మా వదిన అక్కగారి పేరు చెపితే ఆ వాడకట్టుకే హడలు. మా వదినను గురించి కూడ చాలా పుకార్లున్నాయి. పెళ్ళికాక ముందే కాలేజీలో చదువుకొంటున్న రోజుల్లోనే ఒకసారి ఎవరితోనో లేచిపోయిందట... అంతే గాదు. ఒకటి రెండు గర్భస్రావాలు కూడా జరిగాయంటారు. ఆ రోజుల్లో మా ఊళ్ళో ఎక్కడ చూసినా మా అన్నయ్య పెళ్ళిని గురించే చర్చ. మా వదిన తల్లికీ మా బాబాయికి సంబంధం ఉందని కూడ ఎవరో అనగా విన్నాను.

ధర్మరాజులాంటివాడు అన్నయ్య, బాబాయి వచ్చి మెడలు వంచటం చేత, చేసేదిలేక ఆ పెళ్ళికి ఒప్పుకొన్నాడు. వదినతో సహా అన్నయ్య పట్నంలో కాపురం పెట్టిన తర్వాత కూడ వదిన తన స్వేచ్ఛా సంచారాలకు స్వస్తి చెప్పలేదు. ఎన్నోసార్లు అన్నయ్య మందలించినా లాభంలేక పోయింది. చివరకు చెయ్యి చేసి కొనేటంతటి వరకూ కూడా వచ్చింది. "నా ఇష్టం, నువ్వెవరివి నాకడ్డురావటానికి ? నీ మోచేతి నీళ్ళు నేనేమీ తాగటం లేదుగదా... నువ్వు చెప్పినట్టల్లా వంటింటి కుందేలుగా పడిఉండటానికి" అంటూ ఎదురు తిరిగి మొరాయించేది. అలాంటి సంసార జంజాటంలో పడ్డ అన్నయ్యకు ఏమాత్రం మనశ్శాంతి లేకుండా పోయింది.

వదినకు సుందరి అక్కతో పడేది గాదు. అందుకే తప్పనిసరిగా అన్నయ్య అక్కయ్యను హాస్టలులో చేరిపించవలసి వచ్చింది. కాని హాస్టలులో చేరి సంవత్సరం తిరుగక మునుపే అక్కయ్యకు ప్రమాదకరంగా జబ్బు చేసింది. దాంతో హాస్టలు మానిపించి అక్కను యింటికి తీసుకొచ్చాడు అన్నయ్య. ఆ రోజున నానా హంగామా చేసి అందరినీ ధిక్కరించి తన తాలూకూ పూచిక పుల్ల సొమ్మన్నా వదలిపెట్టకుండా అంతా కట్టుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది వదిన. అంతే ! సుందరక్క చనిపోయిన తరువాత కాని మళ్ళీ ఆమె కాపురానికి తిరిగి రాలేదు. ఆ తరువాత అన్నయ్యను మరొక చోటుకు బదిలీ చేసారు.

అన్నయ్య, వదినా, ఇప్పటికీ సరిగా మాట్లాడుకోరనీ ఎవరిదోవ వారిదేననీ అంటూ వుంటారు. 'విడకులిచ్చి మరో పెళ్ళి చేసుకోరాదా' అని అన్నయ్యకు సలహా చెప్పిన వాళ్ళు కూడ ఉన్నారు. కాని మొదటి నుంచీ అన్నయ్య తత్వమే వేరు. సంఘం కోసం, పదిమందీ మెచ్చుకోవటం కోసం తన స్వంత సుఖాన్ని త్యాగం చేయటమే ఆయన లక్ష్యంగా పెట్టుకొన్నాడు.

సుందరి అక్కన్నా, నేనన్నా, అన్నయ్యకు పంచ ప్రాణాలు. మా యిద్దరి సుఖం కోసమే ఆయన బ్రతుకుతున్నాడా అనిపించేది. అక్క చనిపోయిన కొత్తలో ఒక సందర్భంలో ఆయన నాకు ఉత్తరం వ్రాస్తూ "మీరిద్దరూ నాకు రెండు కళ్ళు అనుకొన్నాను బాబూ! ఇప్పుడు ఒక కన్ను గ్రుడ్డిది చేశాడు భగవంతుడు. ఇక నా బ్రతుకూ, నా ఆశా అంతా రెండోకన్నుమీదే ఆధారపడి ఉంది... మనస్సులో ఎలాంటి సంకోచం పెట్టుకోకుండా, ఏం కావాలన్నా నన్ను అడుగు బాబూ..." అంటూ ఎంతో యిదిగా ఏదేదో వ్రాశాడు.

ఈ ఆలోచనలతో ఎప్పుడు నిద్రపట్టిందో ఆ ఈజీ చైర్ లో పడుకొని అలానే నిద్రపోయాను.

★ ★ ★

మర్నాడు రాత్రి మళ్ళీ అన్నయ్యే ఆ ప్రస్తావన తెచ్చాడు.

"నీ మనస్సులో బాధిస్తున్న ప్రశ్న నాకు తెల్సు బాబూ ! రఘుతో సుందరక్క వివాహం జరిగి ఉంటే ఆమె బ్రతికేదేమోనని నీ ఆశ. కాని రఘుతో ఆమె వివాహం జరక్కుండా నేను ఎందుకు కాలయాపన చేశానో నాకూ, ఆ భగవంతుడికీ మాత్రమే తెలుసు. నా హృదయాన్ని దహించి వేస్తున్న ఆ అగ్నిపర్వతాన్ని ఏం చేసుకోవాలో నాకు తెలియక చివరికి ప్రాణంకంటె ఎక్కువయిన నా సుందరినే దానికి బలిచేశాను బాబూ!"

అన్నయ్య ముఖంలో కన్పించిన ఆవేదన చూసి నేను భరించలేకపోయాను. ఏది మరిచిపోవాలనుకుంటున్నాడో దాన్నే కుళ్ళగించి అనవసరంగా ఆయనకు మనస్తాపం కలిగించానని ఎంతో బాధపడ్డాను. ప్రసంగం మరోవేపుకు మళ్ళించాలనే ఉద్దేశ్యంతో "అది కాదన్నయ్యా... పై చదువులకని ఒంటరిగా సుందరక్కను అమెరికా పంపించకుండా ఉంటే బాగుండేదేమో" అన్నాను.

అన్నయ్య కొంచెం తేరుకొని మళ్ళీ చెప్పసాగాడు... "యం.యస్ సి. లో సుందరి ఫస్టు క్లాసులో పరీక్షకాగానే, వాళ్ళ కాలేజీలోనే దానికి ఉద్యోగం రావటం. దాని మనస్సు నొప్పించటం యిష్టంలేక దానికి నేను అంగీకరించటం నీకు తెలుసు. ఢిల్లీ యూనివర్సిటీలో ఉద్యోగం అయి రఘు ఢిల్లీ వెళ్ళిపోయినప్పటినుండి సుందరి ప్రవర్తనలో ఒక విధమైన మార్పు వచ్చింది. కొన్నాళ్ళు పోతేగాని ఆమె మనస్సు స్థిమితపడదనీ, అంతవరకూ ఆమె దగ్గర

వివాహ ప్రస్తావన తేకూడదనీ నేను ఊరుకున్నాను. వాళ్ళూ వీళ్ళూ ఎప్పుడయినా మాటవరసకు పెళ్ళి ప్రస్తావన తెచ్చినప్పుడల్లా సుందరి చికాకు పడుతూ ఉండటం నేను గమనించాను.

సుందరి ఎప్పుడూ ఉద్యోగాలను గురించీ, ఇంకా పై చదువుల్ని గురించే ఆలోచిస్తూండేది ఆ రోజుల్లో. నాకు తెలియకుండా ఎప్పుడూ అమెరికాకు అప్లయి చేసిందో ఏమో, చికాగో యూనివర్సిటీ నుంచి అనుకోకుండా ఆమెకు స్కాలర్ షిప్ వచ్చింది. ఇక వాళ్ళ ప్రొఫెసరూ వగైరా అందరూ వచ్చి నన్ను మెడలు విరిచారు. అలాంటి అవకాశం ఎవరికోగాని రాదనీ, ఆమె ఉజ్జ్వల భవిష్యత్తుకు నేను అడ్డునుంచోటం భావ్యం కాదనీ వాదించారు. నేను ఆ ప్రయాణానికి ఒప్పుకోనేమో అనే ఆందోళన సుందరి ముఖంలో నేను చూడలేకపోయాను. ఆ అవకాశం తీసుకొని బాబాయి నామీద కత్తులు దూయటానికి సిద్ధపడ్డా లక్ష్యం చేయకుండా సుందరి కోసం, సుందరి మనస్సంతృప్తి కోసం అయిష్టంగానే అయినా ఆ ప్రయాణానికి నేను అంగీకరించవలసి వచ్చింది. ఏమో ! నువ్వన్నట్టు అమెరికా పంపకుండా ఉంటే మన సుందరి మనకు దక్కేదేమో !...”

మళ్ళీ అన్నయ్య గొంతు గాద్గదికమైంది. ఆయనకు బాధ కలిగించే ప్రస్తావన తప్పించాలనుకొని కూడా మళ్ళీ ఆ ప్రస్తావన తెచ్చానే అని కించపడ్డాను.

“నేను చాలా సార్లు నిన్ను అడగాలనుకొన్నాను అన్నయ్యా... బాబాయి మన మీద కత్తులు నూరుతుంటే మనం అధమాధముల్లాగ పడి ఉండవలసిన అవసరం ఏమొచ్చిందీ అని... ఆయన చేతిలోనుంచి మన ఆస్తి మనం లాక్కొని ఆయన జోలీ లేకుండా మన మానాన మనం బ్రతకవచ్చు కదా...” అన్నాను.

ఈ సారి నా ప్రయత్నం ఫలించింది. బాబాయి సంగతి ఎత్తేటప్పటికి అన్నయ్య కళ్ళు ఎఱ్ఱపడ్డాయి. ఒకసారి గొంతుక సవరించుకుని మరల చెప్పటం ప్రారంభించాడు.

“బాబాయి సంగతి నీకు తెలియదు __ చిన్న బాబు! ఆయన పయోముఖ విషకుంభం. మనం ఎన్నటికీ ఆయన గుప్పిట్లోంచి తప్పించుకొనిపోయే వీలు లేకుండా ఆయన చేసుకొంటున్నాడు. చనిపోయేముందర అమ్మ నన్ను దగ్గరకు పిలిచి “ముళ్ళమీద వేసిన గుడ్డ జాగ్రత్తగా తీసికోవాలి పెద్ద బాబు...” అని చెప్పింది. తర్వాత కొన్నాళ్ళకు గాని అమ్మ అన్నమాటలు పూర్తిగా నాకు అర్థం కాలేదు.

“నాన్న, బాబాయి, అత్తా అంతా కలిసి ఉమ్మడి కాపురంగా ఉంటున్న రోజులు నాకు కొంచెం జ్ఞాపకం. మన మేనత్తకు చిన్నతనంలోనే పెళ్ళయింది. కూతురు పుట్టిన తర్వాత క్షయవ్యాధితో ఆమె భర్త చనిపోయాడు. కుటుంబంలో క్షయ ఉందనే వాదు వల్ల కొంతా, అత్త నోరుకు జడిసి కొంతా ఆమె కూతురికి సంబంధాలు రాలేదు. అప్పుడు చెల్లెలిమీద ఉండే ప్రేమతో నాన్న బాబాయిని భయపెట్టీ, బ్రతిమాలీ ఎలాగో ఆమె కూతుర్ని పెళ్ళి చేసుకునేందుకు ఆయనను ఒప్పించాడు. కూతురితో పాటు ఆమె కూడ వచ్చి మన యింట్లోనే తిష్ఠవేసింది. ఆ పెళ్ళి జరిగిన దగ్గర నుంచీ, బాబాయి, అత్త లాలోచీ అయ్యారు. నాన్న నోరులేని వాడవటంతో సంసారం గుట్టుమట్లన్నీ వాళ్ళు చేజిక్కించుకొని, ఆ రోజు నుంచి యీ రోజు దాకా మనందర్నీ తమ చేతుల్లో కీలు బొమ్మలు చేసి ఆడిస్తున్నారు బాబూ !

“ఎంత డబ్బు ఉన్నదో ఎవ్వరికీ తెలియదు. ఊళ్ళో మాత్రం చాల సంపన్న కుటుంబం అనీ, అయినా కాకికి కూడా చెయ్యి రాల్చని మనుష్యులమనీ అంతా అనుకుంటారు. మనం గట్టిగా నిలదీసి అడిగితే సున్నాకి సున్నా హళ్ళికి హళ్ళీ లెక్క తేల్చి మనకి చిప్పా కఱ్ఱా చేతికీయగల శక్తి ఉంది బాబాయికి.

“బాబాయి ఎంత ఘటికుడో అర్థం కావటానికి ఒక చిన్న సంఘటన చెపుతా చూడు. ఆయన నా వివాహం ఎలా జరిపించాడో అదంతా ఒక పెద్దగాథ. అదలా ఉంచు, బాబాయి గారి అల్లుడు నీకు తెల్సుగదా ! అతడు మనిషో పశువో చెప్పటం కష్టం. అతడికి లేని దురలవాటు అంటూ లేదు. తాగుడూ, జూదం, వ్యభిచారం __ అన్ని అవలక్షణాలూ ఉన్నాయి. మన అత్తనీ, బాబాయినీ కొన్నాళ్ళు గజగజలాడించాడు. అతను అన్నమాట కాదంటే చేయి చేసుకొనటానికి కూడా సందేహించేవాడు కాదు. పులిలాగ అందర్నీ భయపెట్టే బాబాయి అతని దగ్గర పిల్లి అయిపోయాడు. చంపుతాడేమోనని బయమేమో ! అంతే. అలాంటి వాళ్ళు అలాగే భయపడుతూ ఉంటారు.

చివరికి చిత్రం ఏమిటంటే _ అలాంటి వాణ్ణి కూడా బాబాయి తన చెప్పు క్రింద తేలు లాగ పడి ఉండేట్టు చేసుకో గలిగాడు. చెడు తిరుగుళ్ళ వల్ల అతగాడి ఖర్చులు అప్పులు కూడ పెరిగిపోయాయి. మార్వాడీ నోటీసు ఇచ్చాడు. ఆ అవకాశం తీసుకొని, నేర్పుగా బాబాయి అతని ఆస్తి అంతా కూతురి పేర

రాయించి ఆ మార్వాడీ అప్పు తీర్చాడు. ఎంత ఓపిగ్గా బాబాయి అలాంటి అవకాశం కోసం ఎదురు చూశాడో తెలుసుకుంటే, బాబాయి ఎంత నేర్పరో అర్థం అవుతుంది. ఇప్పుడతను కోరలు తీసిన పాము. బాబాయి ఎంత చెబితే అంత."

ఆ తరువాత కొంతసేపు ఎవరి ఆలోచనల్లో వాళ్ళం పడి నిశ్శబ్దంగా ఉండి పోయాం. కాసేపటికి అన్నయ్యే సుందరక్కను గూర్చి చెప్ప మొదలు పెట్టాడు.

"అమెరికాలో సుందరి జీవితం సంతోషంగానే గడిచింది చిన్నబాబూ ! వారం, వారం నాకు ఉత్తరాలు రాస్తూ వుండేది. అక్కడ తన స్నేహితుల్ని గురించీ, తన ప్రొఫెసరు తనంటే ఎంత అభిమానం చూపెడుతూ ఉందీ, తన చదువు ఎంత సంతోషంగా సాగుతున్నదీ అంతా వివరంగా వ్రాస్తూ ఉండేది.

"ఒకసారి ఒక చిత్రమైన ఉత్తరం వచ్చింది. తన రూంమేటు ఒక అమ్మాయి ఉందట. చాలా మంచిదట, చాలా అందంగా నిరాడంబరంగా ఉంటుందట. కాని ఆ అమ్మాయి ఆరోగ్యమే అంతంత మాత్రం. ఒకసారి ఏదో జబ్బు చేసినప్పుడు, ఇంక కొన్ని సంవత్సరాలకంటే ఎక్కువ కాలం ఆ అమ్మాయి బ్రతకదని డాక్టర్లు అన్నారట. ఆ సంగతి ఆ అమ్మాయికి తెలియకుండా బంధువులు దాచి పెట్టారు. ఆ అమ్మాయికి దూరపు బంధువు ఒకామె ఏదో మాటల సందర్భంలో సుందరితో ఆ మాట చెప్పిందట. "ఆ అమ్మాయికి ఆ విషయం తెలిస్తే ఎలా కుమిలిపోతుందో అన్నయ్యా" అంటూ, పిచ్చి తల్లి ! సుందరి ఎంతో గాభరా పడిపోతూ ఉత్తరం వ్రాసింది. ఆ ఉత్తరం ఎన్నాళ్ళో నన్ను కలచి వేచింది."

★ ★ ★

మళ్ళీ అన్నయ్య ముఖం మీద విషాద మేఘాలు ముసురుకోడం గుర్తించాను. పైకి ఎంతో గంభీరంగా పెద్ద పులిలా కన్పించినా నిజానికి అన్నయ్య హృదయం బహు సున్నితమైంది. సుందరక్క జీవితం విషయంలో ఆయన ఏదో దాస్తున్నాడని ఉన్నా ఏమాటంటే అన్నయ్య మనస్సు ఇంకా బాధపడుతుందో అని భయపడి, ఊపిరి బిగపట్టి కూర్చున్నాను. ఆ రోజున అన్నయ్య ధోరణి చూస్తే ఎలాగూ ఆయన తన మనస్సులోని రహస్యాలన్నీ నాకు చెప్పి వేయటానికే పూనుకొన్నట్లు కనిపించింది. ఇంతలో నేను తొందరపడటం దేనికని ఊరుకున్నాను.

కాసెపు మౌనంగా ఉండి నాకు కనబడకుండా పక్కకు తిరిగి కళ్ళు వత్తుకొని కొంచెం స్థిమిత పడిన తర్వాత మళ్ళీ అన్నయ్యే చెప్పటం సాగించాడు.

"సుందరి అమెరికాలో ఉండగా బాబాయి ఒక చిత్రం చేశాడు. నాతో మాట మాత్రం కూడా అనకుండా సుందరికి ఒక పెద్ద ఉత్తరం వ్రాసాడు. సుందరికి ఓ వరుణ్ణి నిర్ణయించి, ఆ వరుణ్ణే తప్పక చేసుకోవలసిందని ఉపదేశిస్తూ వ్రాసిన ఉత్తరం అది. ఆ వరుడు కూడ అప్పుడు అమెరికాలోనే ఇంకో యూనివర్సిటీలో ఏదో పెద్ద చదువు చదువుతున్నాడు. ఏదో పనిమీద అతడు సుందరి చదువుతున్న యూనివర్సిటీకి రాబోతున్నాడనీ అతడ్ని కలుసుకొని మాట్లాడి వివాహానికి అంగీకారం తెలియ జేస్తే మిగిలిన ఏర్పాట్లన్నీ తను చేస్తాననీ వ్రాశాడు.

"ఆ వరుడు ఎవరో కాదు. మన అమ్మకు ఒక అన్నగారు ఉండేవాడని నీవు వినే ఉంటావు. నాకే ఆయన సరిగా గుర్తు లేరు. పెళ్ళయిన తర్వాత ఆయనకొక కొడుకు పుట్టడం, వాడు పుట్టిన పది పదిహేను రోజులలోకే ఆయన చనిపోవటం జరిగింది. తర్వాత కొద్ది రోజులకే ఆయన భార్య అర్ధరాత్రికి, అర్ధరాత్రి ఎవర్నీ తీసుకొని లేచి పోయిందట. ఆనాటి నుంచీ వాళ్ళతో మన కుటుంబానికి ఏ విధమైన సంబంధం లేదు. కాని కుర్రవాడు పెద్దవాడైన తరువాత, వాడు మాత్రం అప్పుడప్పుడు వచ్చిపోతూ ఉండేవాడు. నేనూ వాడిని ఒకటి రెండు సార్లు చూసిన గుర్తు. నాకంటే ఒక ఏడాది చిన్నవాడు. ఇప్పుడు మన బాబాయి సుందరికి వ్రాసిన వరుడు వాడే.

"చికాగోలో అతడ్ని కల్సుకొన్న తరువాత సుందరి అదంతా ఒక పెద్ద కథగా నాకు ఉత్తరం వ్రాసింది. చదువులకోసం అమెరికా వెళ్ళిన మన దేశస్థులు చాలమంది చాల దారుణంగా ప్రవర్తిస్తూ ఉంటారట. తమకు పెళ్ళి అయి. బిడ్డా, పాపా, ఉన్నా, పెళ్ళి కానట్టు నటిస్తారట. ఇక్కడ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వాళ్ళయినా, తాము జమిందారులమనీ, మహా సంపన్నులమనీ గప్పాలు చెబుతారట. అలా చెప్పి అమెరికన్ ఆడపిల్లలకు ఆశలు కల్పించి మోస పుచ్చుతారట. మన దేశానికి కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉన్నా. మనం అంతా ఒక దేశానికి చెందిన వాళ్ళం అనే భావం లేకుండా సంకుచితమైన కులమత ద్వేషాలతో, భాషా విభేదాలతో అసూయతో, ఒకళ్ళనొకళ్ళు ద్వేషించుకుంటూ నికృష్టంగా బ్రతుకుతూ ఉంటారట. ప్రతివాళ్ళను గురించీ ఏవేవో పుకార్లు పుట్టించి అసభ్యంగా ప్రవర్తిస్తారట.

"అమెరికాలో ఉన్న భారతీయ విద్యార్థుల సమావేశం ఒకటి ఏర్పాటు చేస్తే సుందరి కూడా దానికి వెళ్ళిందట. ఆ సందర్భంలోనే అక్కడకు వచ్చిన మన మేనత్త కొడుకు శేఖర్ ఆమె తటస్థపడ్డాడట. బాబాయి అతడ్ని గురించి వ్రాసి అతడి ఫోటోకూడా పంపటం వల్ల తెలికగానే అతడ్ని పోల్చుకొనగల్గిందట.

కాని అతడి పద్ధతి మాత్రం సుందరికి ఏమాత్రం నచ్చలేదు. అతడు ఆమెతో మాట్లాడిన కాసేపటిలోనే తన గొప్పలు చెప్పుకోవటం తప్ప మన చదువు సంగతిగాని, సుందరి చదువు సంగతి గాని ఏమీ ఎత్తలేదట.

"అతడు మాట్లాడి వెళ్ళిన తర్వాత సుందరికి పరిచితురాలైనా ఒక అమ్మాయి వచ్చి 'ఏమండీ ! ఆ శేఖర్ మీకు ఎలా తెలుసు ?' అని అడిగిందట. తమ చుట్టరికం సంగతి చెప్పి, సుందరి అదే తాను మొదటిసారిగా అతడిని కల్సుకోవటం అందట. ఆ అమ్మాయి కూడా శేఖరు చదువుతున్న యూనివర్సిటీలోనే చదువుతూంది. తమ యూనివర్సిటీలో శేఖర్ ప్రతాపాన్ని గూర్చి, ఆ అమ్మాయి చిత్ర విచిత్రాలయిన కథలెన్నో చెప్పిందట. అతడికి ఆడపిల్లల పిచ్చి అనీ, అందమైన ఆడపిల్ల కంటపడితే చాలు ఎలాగో అలా తంటాలు పడి పరిచయం సంపాదించుకొని తన గొప్పలు చెప్పుకొని పెళ్ళి కూడ చేసుకొంటానని మాటయిచ్చి మోసం చేయటానికి చూస్తుంటాడనీ, ఇప్పుడు అతణ్ణి అందరూ అసహ్యంగా చూస్తున్నారనీ చెప్పిందట.

"బాబాయికి కోపం రాకుండా, తనకు ఆ సంబంధం ఇష్టం లేనట్టు నన్ను ఏదో విధంగా సర్ది ఉత్తరం వ్రాయమంది సుందరి. ఆ ఉత్తరంలోనే చూచాయగా తన మనస్సులోని అభిప్రాయం తెలియపరిచింది. పెళ్ళి చేసుకోవటం అంటూ వస్తే రఘూనితప్ప మరొకర్ని చేసుకోకూడదని ఆమె నిశ్చయం చేసుకొన్నట్టు కనిపించింది.

'... నా ఉద్దేశ్యంలో ప్రేమించడం అనేది ఒకసారే జరుగుతుంది. నన్నెవరయినా అడిగితే నా పెళ్ళి నిశ్చయమైనదనే చెబుతున్నాను. మనసారా ప్రేమించుకుంటే పెళ్ళి చెసుకొన్నట్టే గదా అన్నయ్యా...' అని వ్రాసింది.

"సుందరి ఇక నాలుగైదు నెలల్లో చదువు పూర్తి చేసి ఇండియాకు రాబోతున్నట్లు ఉత్తరం వ్రాసిన తరువాత నాలో మళ్ళీ నూతన శక్తి వచ్చినట్లు అనిపించింది.

★ ★ ★

"క్రిష్టమస్ శలవలకు తన స్నేహితురాళ్ళతో కలిసి న్యూయార్కు చూడటానికి వెళ్ళుతున్నాననీ, పది పదిహేను రోజుల పాటు నన్ను ఉత్తరాలు వ్రాయవద్దనీ, తనే వ్రాస్తుంటానని వ్రాసింది. అటు తరువాత వాషింగ్ టన్ నుంచి సుందరి ఒక వుత్తరం వ్రాసింది. అక్కడ వైట్ హౌస్, అవీ వర్ణిస్తూ చాలా సంతోషంగా వ్రాసింది. ఆ ఉత్తరం చూసి సుగుణాల రాశి, చదువుల రాణి అయిన మన సుందరి వంశానికి ఎంతో ప్రతిష్ట తేబోతుందిగదా అని నేను ఎంతో పొంగిపోయాను.

"అంతే ! అదే ఆమె దగ్గర నుంచి వచ్చిన ఆఖరు ఉత్తరం. అటు తరువాత వారం రోజులకే సుందరి హఠాత్తుగా గుండెజబ్బుతో చనిపోయినట్టు న్యూయార్కు నుంచి కేబుల్ వచ్చింది. నా రెండు కళ్ళల్లో ఒక కన్ను దేవుడు పొడిచేశాడు. అంతలో అంత ఘోరం జరుగుతుందని కలలో కూడ అనుకోలేదు. ఆ వార్తనన్ను ఎలా క్రుంగదీసిందో నేనెలా జీవచ్చవంలా అయిపోయానో, అదంతా నీకు చెప్పనక్కరలేదు చిన్నబాబూ. కాని న్యూయార్కు నుండి ఆమె స్నేహితురాళ్ళు వ్రాసిన ఉత్తరంలో సుందరి చావుకు నిజమైన కారణం తెలియక చాల తికమక పడ్డాను. తర్వాత కొద్ది రోజులకే అనుకోకుండా ఎక్కడినుండో ఊడిపడ్డట్టు రఘు వచ్చాడు.

"నేను అతడి ముఖం చూడలేకపోయాను. ఒంట్లో బాగుండలేదనో, ఇంట్లో లేననో చెప్పి పంపించి వేద్దామనుకున్నాను. కాని సుందరి హృదయపూర్వకంగా ప్రేమించిన వ్యక్తి అతడు అని జ్ఞాపకం వచ్చిన తర్వాత అలా చేయలేక పోయాను.

"రఘు చాల ఉత్సాహంగా కన్పించాడు. అతడికి ఇంకా ఆ వార్త తెలిసినట్టు లేదు. తన యూనివర్సిటీ తరపున మూడు నెలల పాటు అమెరికాలో టూరు చేసి వచ్చినట్టూ, వస్తూ వస్తూ న్యూయార్కులో సుందరిని కలుసుకొన్నట్టూ చెప్పాడు. తన ప్రయాణం ఏర్పాట్లన్నీ పూర్తయిన తర్వాత సుందరి కనిపించినందువల్ల ఎక్కువ సేపు ఆమెతో గడపలేక పోయానన్నాడు. అతడు సుందరిని కలుసుకున్నట్టు చెప్పిన రోజుకి, మర్నాడే సుందరి చనిపోయినట్టు నాకు కేబుల్ రావటం నాకు చాల ఆశ్చర్యాన్ని కలిగించింది. నా భయాలన్నీ నిజమైనట్లు కనిపించింది. ఆ దుర్వార్త అతడికి ఎలా చెప్పాలో తోచక మౌనంగా అలాగే కూర్చుండి పోయాను.

"కాసేపయాక అతడే బెరుకుబెరుకుగా మీకు అభ్యంతరం లేకపోతే నేనూ సుందరీ వివాహం చేసుకోవాలను కుంటున్నామండీ... నా కుటుంబ పరిస్థితి అంతా రవ్వంత కూడ దాచకుండా సుందరికి చెప్పివేశాను... ఆమె తనకేమీ అభ్యంతరం లేదండి. అయితే... మీ మాటమీద ఆమెకు ఎంత గురో, మీరంటే ఎంతగౌరవమో నాకు తెల్సు... మాటల సందర్భంలో చాలా సార్లు అంది... మిమ్ములను తండ్రికంటే ఎక్కువగా చూసుకొంటూ ఉంటానని.. మీ

ఆశీర్వాదం లేనిదే ఈ వివాహం జరుగదు...' అని చెప్పాడు. మధ్య మధ్య తడబడుతూ, నా కేసి సూటిగా చూడలేక కిటికీలోనుంచి కనిపిస్తున్న కొబ్బరిచెట్ల కేసి చూస్తూ రఘు చెప్పుకుపోతున్నాడు.

నేనింక దుఃఖం ఆపుకోలేకపోయాను. రఘు నా వేపు తిరిగి చూసేసరికి నా కళ్ళు ఎర్రపడి ఏ క్షణం అయినా వర్షించడానికి సిద్ధంగా ఉన్న వర్షమేఘాల్లాగ ఉండటం చూసి అతడు నిర్ఘాంతపోయాడు.

బిక్కుబిక్కుమంటూ 'ఏమండీ ఒంట్లో బాగుండలేదా ?... నా తెలివితక్కువ తనం చేత మిమ్మల్ని నేనేదైనా నొప్పించేమాట అని ఉంటే క్షమించండి... పోనీ మళ్ళీ వస్తాను..." అంటూ లేవబోయాడు.

చేతితోనే కూర్చోమని సంజ్ఞచేసి, పొంగి పొరలి వచ్చే దుఃఖాన్ని కష్టం మీద దిగమింగి, గద్గద స్వరంతో 'సుందరి మనందరినీ వదలిపెట్టి శాశ్వతంగా వెళ్ళి పోయింది రఘూ' అనగల్గాను.

"పిడుగు పడ్డ వాడిలాగ నిర్ఘాంత పోయి కదలికా మెదలికా లేకుండా అలాగే కూర్చుండి పోయాడు రఘు. నేను కంగారుపడ్డాను. సుందరితో అతడి అనుబంధం అంత గాఢమైందని నేను అనుకోలేదు. లేకపోతే అంత హఠాత్తుగా ఆ వార్త అతనికి చెప్పి ఉండను. ప్రక్కన చేరి వెన్ను నిమురుతూ న్యూయార్కు నుంచి కేబుల్ రావడం, తరువాత నాలుగు రోజులికి సుందరి స్నేహితురాండ్ర నుండి వచ్చిన ఉత్తరంలోని వివరాలు అన్నీ చెబుతూ కూర్చున్నాను.

కాసేపటికి రఘు రెండు చేతులతో ముఖం కప్పుకుని చిన్న పిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టాడు. వర్షం వచ్చేముందు ఉమ్మరించే స్థితే దారుణమైంది. వర్షం ఆరంభమైన తర్వాత ఇక ఫరవాలేదు. మబ్బు పూర్తిగా వర్షించిన వెంటనే తెరిపిచ్చేస్తుంది. రఘు విషయమై నా ఆందోళన తగ్గింది.

"మరో చిత్రమైన అనుభూతి. సుందరి మరణవార్త విన్న దగ్గర నుంచి ఆ అగ్నికి నేనొక్కణ్ణే ప్రధానమైన ఆహారం అయ్యాను. అప్పుడు సుందరి వియోగం వల్ల నాకంటే ఎక్కువగా దుఃఖిస్తున్న మరో ప్రాణి కనిపించేసరికి చిత్రంగా నాకెంతో ఊరట కలిగింది.

"వెక్కి వెక్కి ఏడుస్తూనే 'నా జీవితానికింకేమి మిగిలింది?.. నా ఒకే ఒక ఆశ గంగ పాలైపోయింది... న్యూయార్కులో నేను ఆమెను కలుసుకొనకుండా ఉంటే ఎంత బాగుండేది ?.. మచ్చలేని సుందరి జీవితానికి మచ్చ తెచ్చాను...' మధ్య మధ్య ఆగి ఆగి అన్నాడు రఘు.

"రఘు మాటలతో సుందరి ఆకస్మిక మరణానికి కారణం నాకు అర్థమైపోయింది. ఒక్క క్షణం రఘూ మీద నాకు చాలా కోపం వచ్చింది. నా సుందరిని పొట్టన పెట్టుకొన్న హంతకుడు లాగ నాకు అతడు కనపడ్డాడు. కాని మరుక్షణంలో కొంచెం తమాయించుకొని నిదానంగా ఆలోచిస్తే __ రఘుది గాని సుందరిది గాని ఇందులో తప్పు ఏముంది ? ఆ మాట నేను వాళ్ళకు చెప్పి ఉంటే వాళ్ళు అంత అవివేకంగా ప్రవర్తించి ఉండేవాళ్ళు కాదు. ఆ మాట ఎవరికీ చెప్పకుండా దాచి పెట్టిన నేనే హంతకుణ్ణి అనిపించింది.

"సుందరి హఠాన్మరణానికి కారణం రఘూతో చెబుదామా అనుకొన్నాను. కాని ఏమి లాభం ? జీవితాంతం ఒక ఆరనిచిచ్చు అతడి హృదయంలో రగుల్కొలపటమే అవుతుంది. అంతకంటే ప్రయోజనం లేదు. "ఏ అగ్ని పర్వతాన్ని నా హృదయంలో దాచుకొని ఈ విపత్తుకు నేను కారణమయ్యానో, ఆ అగ్ని పర్వతం నాలోనే అణగి ఉండి జీవితాంతం నన్నే దహించనీ" అనుకొన్నాను. కాని ఇప్పుడు నాలో ఓర్పు నశించింది. ఇవాళ ఇక ఆ రహస్యం నీ ముందు నేను దాచలేను చిన్నబాబూ!"

★ ★ ★

ఆవేశంతో అన్నయ్య గొంతు బొంగురు పోయింది. కాసేపు ఆగి, ఆవేశాన్ని దిగమింగి మళ్ళీ తాపీగా అన్నయ్యే చెప్పుకు పోయాడు.

"హాస్టల్ లో ఉండగా సుందరికి పెద్ద జబ్బు చెయ్యడం, తరువాత ఒక సంవత్సరం చదువు మానిపించి ఆమెను నా దగ్గరే ఉంచుకోవటం నీకు తెలుసు. ఆ జబ్బు నయమైన కొత్తలో బలంపట్టడానికి ఏమైనా టనిక్ లు రాసి ఇవ్వండని ఒక రోజు నేను డాక్టరు గారి దగ్గరకు వెళ్ళాను. ఏవో మందులు రాసి యిచ్చి తరువాత ఆయన చాల తటపటాఇస్తూ 'ముందు జాగ్రత్త కోసం మీకొక విషయం చెప్పాలనుకొంటున్నానండీ' అన్నాడు. 'దానికేముంది అవశ్యం చెప్పండి డాక్టరుగారూ...' అన్నాను. నా గొంతుకలో కనిపించిన ధైర్యంవల్ల ఆయనలో సంకోచం తగ్గి ఒక నిశ్చయానికి వచ్చినట్టు ఆయన కనిపించాడు. ఆవాళ ఆయన చెప్పారు. సుందరి గుండె.. అదేదో పేరు చెప్పాడు అలాంటి గుండె ఉన్నవాళ్ళకి శారీరకంగా ఎక్కువ ఉద్రేకం కలిగితే గుండె ఆగిపోయే ప్రమాదం ఉందట. అలాంటి గుండె ఉన్న స్త్రీలలో చాలమంది భర్తతో ప్రథమసంయోగం నాడు గుండె ఆగి చనిపోవచ్చుట.

ఆయన మాటలకు నేను చాల బేజారై పోయినట్లుగా ముఖంలో ఆయన గుర్తించినట్టున్నారు. 'వెళ్ళివస్తా డాక్టరు గారూ...' అని నేను లేచేసరికి ఆయన దగ్గరకు వచ్చి భుజం తడుతూ 'ఆదుర్దా పడకండి... క్రమంగా శరీర తత్వం మారి గుండె మళ్ళీ మామూలు పరిస్థితికి వచ్చే అవకాశం కూడ లేకపోలేదు. కాని వివాహానికి ముందు డాక్టరుతో పరీక్ష చేయించి ప్రమాదం లేదని నిర్ధారణ చేసుకొని మాత్రం వివాహం చెయ్యండి...' అన్నాడు.

"ఆయన అన్న ఆఖరి మాటలు కేవలం నన్ను ఓదార్చటానికి అన్నారని గుర్తించలేకపోయాను. ఆ మాటలు కల్పించిన ఆశతోనే ఈ సంగతి అన్నాళ్ళూ గుండెల్లో దాచుకున్నాను. సుందరి అమెరికా వెళ్ళటానికి, 'విసా' తీసుకొనే ముందు డాక్టరు పరీక్ష చేసి, ఎక్సరే కూడా తీశారు. వాళ్ళేమీ అభ్యంతరం చెప్పలేదు. అది నాకు మరీ ధైర్యాన్ని ఇచ్చింది. అమెరికానుంచి తిరిగి రాగానే సుందరిని డాక్టరుతో పరీక్ష చేయిస్తే ఆమె గుండె మాములుగా ఉన్నట్టు తేలుతుందనీ, అప్పుడామెను ఒక ఇంటిదాన్ని చేయవచ్చుననీ గంపెడు ఆశతో ఉన్నాను... నా ఆశలన్నీ నిరాశలైనాయి... దేవుడు నన్ను మొదటనుండీ చల్లగా చూడటం లేదు చిన్నబాబూ !"

అంతవరకూ ఆపుకొంటూ వచ్చిన దుఃఖం అంతా ఒక్కసారిగా పైకి వచ్చింది. అన్నయ్యను ఓదార్చటం ఎలాగో నాకు తెలియలేదు. అంత బేలగా అన్నయ్య దుఃఖపడడం నేనూ అదే మొదటి సారి చూడటం. నాకూ దుఃఖం ఆగలేదు. దేవుడిలాంటి అన్నయ్యను అపార్థం చేసుకున్నందుకు నామీద నాకే ఏవగింపు కలిగింది.

రాత్రి ఒంటిగంట కొట్టింది. లోకం అంతా నిద్రా ముద్రితమై ఉన్న సమయంలో, అద్దె గదిలో నేనూ, అన్నయ్యా ఒకళ్ళనొకళ్ళం ఓదార్చుకొంటూ చలికి గజగజ వణుకుతున్న రెండు గువ్వల్లాగా ముడుచుకొని కూర్చున్న దృశ్యం, మనుష్య జీవిత వాస్తవిక ప్రాంగణంలోకి మొట్ట మొదటిసారిగా అన్నయ్య నా చెయ్యి పట్టుకొని నన్ను ప్రవేశ పెట్టినట్టు అనిపించిన ఆ రాత్రీ, నా స్మృతి పథంలో ఎన్నటికీ చెరిగిపోవు.

★★★

COMMENTS